సాక్షి కర్నూలు

ఆదివారం । 24 । మార్చి । 2024




అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: నిత్యకళారాధన వేదికపై శనివారం సికింద్రాబాద్‌కు చెందిన పసుపర్తి సాయి దీపిక, కూచిపూడి నృత్య భారతివారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



కల్యాణ వైభోగమే..

దిగువ అహోబిలంలో శనివారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. IIలో▸



కర్నూలులో 'పాణ్యం' నామినేషన్లు

పాణ్యం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థులు కర్నూలులోనే నామినేషన్ వేయాల్సి ఉంటుందని పాణ్యం నియోజకవర్గ ఈఆర్‌ఓ నారపురెడ్డి మౌర్య తెలిపారు. IIలో▸

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:33	ఉ॥ 4:54
ఆదోని	సా॥ 6:36	ఉ॥ 4:57
నంద్యాల	సా॥ 6:33	ఉ॥ 4:51
ఆత్మకూరు	సా॥ 6:31	ఉ॥ 4:52
బనగానపల్లె	సా॥ 6:34	ఉ॥ 4:52

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

అబద్ధాలు చెప్పడం చాలా పాపం. అల్లాహ్ వీరి ప్రార్థనలు అంగీకరించరు. రోజా ఉండి అబద్ధాలు చెబితే రోజా కూడా దీలా పడుతుంది. అంతటి పాపం చేకూర్చే అబద్ధం నుంచి నియంత్రణలో ఉండండి. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

శ్రీమఠానికి రూ.10 లక్షల విరాళం



శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావుకు విరాళం అందజేస్తున్న దాతలు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి విరాళాలు విరివిగా అందుతున్నాయి. శనివారం కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన జలజాక్షి కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. శ్రీమఠం భక్తుల కోసం నిర్వహిస్తున్న అన్నదానానికి ఈ మొత్తాన్ని అందజేసినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మఠం మేనేజర్ దాతలకు శేషవస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపిక, ఫల మంత్రాక్షితలతో ఆశీర్వదించారు.

నేడు పీసీసీఎఫ్ రాక

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ రాష్ట్ర దళాధిపతి (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) చిరంజీవి చౌదరి ఆదివారం రాత్రి కర్నూలు రానున్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు కర్నూలు సిటీ ఫారెస్ట్‌ను సందర్శించి, దాని అభివృద్ధికి సూచనలు ఇవ్వనున్నారు. అనంతరం మంత్రాలయం సందర్శిస్తారు. ఆదోని – ఎమ్మిగనూరు రహదారిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కోటేకల్ నగర వనం ప్రాంతాన్ని సందర్శించి దాని నిర్మాణంపై అధికారులకు దిశానిర్దేశం చేస్తారని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఇన్విజిలేటర్ తొలగింపు

- సీఎస్, డీఓలకు, సీఆర్‌పీకి షోకాజ్ నోటీస్ జారీ

కర్నూలు సిటీ: మద్దికెరలోని పదోతరగతి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించినట్లు డీఈఓ శామ్యూల్ తెలిపారు. పరీక్షలో సహకరిస్తానని విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ విషయంపై విద్యార్థులు కానీ, తల్లిదండ్రులు కానీ ఫిర్యాదు చేస్తే సదరు టీచర్‌పై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయించడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా కృష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. పరీక్ష ప్రారంభం అయినా ఆ కేంద్రంలోనే సీఆర్‌పీ ఉంటున్నారని ఫిర్యాదు రావడంతో ఆయనకు కూడా షోకాజ్ నోటీస్‌లు ఇచ్చామన్నారు. కేంద్రంలో సీఆర్‌పీ ఉన్నట్లు విచారణలో తెలితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

ఓటరు స్వేచ్ఛకు ప్రాధాన్యం.. ప్రశాంత ఎన్నికలే లక్ష్యం!



సాక్షి ఇంటర్వ్యూ

'అతి పెద్ద ప్రజాస్వామ్య పండుగ ఎన్నికలు. ఈ పండగ ప్రతీ కుటుంబం జరుపుకోవాలి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి. ఓటు హక్కు ఉన్న అందరూ స్వేచ్ఛగా ఓటు వేయాలి. ఓటర్ల హక్కులకు భంగం లేకుండా స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడమే ఎన్నికల అధికారిగా నా కర్తవ్యం. జిల్లాలో ఎక్కడా ఒక గొడవ కూడా జరగకుండా, రీపోలింగ్ నిర్వహించే అవసరం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా గట్టి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు రాజకీయ పార్టీలు, ప్రజల సహకారం కూడా ఉండాలి. ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంకొన్ని పురోగతిలో ఉన్నాయి. ఎక్కడ, ఏ ఘటన జరిగినా, ఇబ్బంది ఉన్నా నిరభ్యంతరంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు..' అని జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. ఎన్నికల సందర్భంగా కలెక్టర్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

– సాక్షి ప్రతినిధి, కర్నూలు

సాక్షి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది? పక్కాగా ఎన్నికల ప్రక్రియను ముగించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

కలెక్టర్: కోడ్ అమలులోకి రాగానే 24, 48, 72 గంటల్లోగా పబ్లిక్ పార్క్‌లు, బస్టాండ్, రైల్వేస్టేషన్లు.. ఇలా అన్నిచోట్ల రాజకీయ నేతల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాం. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించాం. ఇప్పటికే ఉన్న హోర్డింగ్‌లు అలాగే ఉంటాయి. ఇవి కూడా అన్ని పార్టీలకు సమానంగా ఉండేలా చూస్తాం. కొత్తవాటికి అనుమతి ఇవ్వం. ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్‌తో పాటు పలు శాఖల్లో మొదలుకాని పనుల వివరాలు ఎన్నికల కమిషన్‌కు పంపాం. కొత్త పనులు చేయకూడదు.

సాక్షి: ఎన్నికలకు ప్రత్యేకంగా స్క్వాడ్ ఏర్పాటు చేశారా?


కలెక్టర్: ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) టీం, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వైలెన్స్ బృందాలు, ఎలక్షన్ ఖర్చు లెక్కించే బృందాలను మొత్తం ఐదింటిని ఏర్పాటు చేశాం. అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్నారా? అనుమతి తీసుకున్నారా? అనుమతిలోని నిబంధనలను అతిక్రమించారా? అని ఈ బృందాలు పర్యవేక్షిస్తాయి. ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌తో పాటు అన్నింటికీ అనుమతి తీసుకోవాలి. లేకపోతే సీజ్ చేస్తాం. సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చాం.

సాక్షి: ఈవీఎంలు, ఇతర సామగ్రి సిద్ధమైందా?

కలెక్టర్: అక్టోబర్, నవంబర్‌లోనే ఈవీఎంలు, ఈవీప్యాడ్‌లు పరిశీలించాం. బెల్ ఇంజినీర్లు వచ్చి 20రోజులు ఇక్కడే ఉండి అన్నింటి పనితీరును పరిశీలించారు. పోలింగ్‌బూత్‌లకు సరిపడా ఈవీఎంల కంటే 20శాతం అదనంగా ఉన్నాయి. ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే మార్చేస్తాం. పోలింగ్‌కు పది రోజుల ముందు, మే మొదటి వారంలో వీటిని నియోజకవర్గాలకు పంపుతాం. బెల్ ఇంజినీర్లు వాటి పనితీరు మరోసారి పరిశీలించి, బ్యాలెట్లు అతికించి సిద్ధం చేస్తారు. స్ట్రాంగ్‌రూంలు, వెహికల్స్, సిబ్బంది, దారులు, పోలింగ్ స్టేషన్లు అన్నింటిపై గట్టి నిఘా ఉంచాం.

'జీరో వయెలెన్స్.. నో బైపోల్' నినాదంతో ముందుకు

- అధికారులు, ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చాం
- రాజకీయ పార్టీలకు ఇదివరకే అవగాహన కల్పించాం
- అభ్యర్థుల ఖర్చు పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- ఫిర్యాదులకు సీ–విజిల్‌తో పాటు టోల్‌ఫ్రీ నెంబర్‌లు
- పోలింగ్ కేంద్రాలలో వంద శాతం సీసీ కెమెరాల ఏర్పాటు
- అర్బన్ ప్రాంతాల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సృజనతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ



సాక్షి: స్ట్రాంగ్ రూంలు ఎక్కడ ఏర్పాటు చేశారు? కౌంటింగ్ ఎక్కడ ఉంటుంది?

కలెక్టర్: అన్ని నియోజకవర్గాల ఈవీఎంలను తుదిగా రాయలసీమ యూనివర్సిటీకి తీసుకొస్తాం. అక్కడే స్ట్రాంగ్‌రూంలను ఏర్పాటు చేశాం. కౌంటింగ్ కూడా అక్కడే జరుగుతుంది.

సాక్షి: ఎన్నికల్లో ఎంత మంది సిబ్బంది పాల్గొంటున్నారు?

కలెక్టర్: జిల్లాలో 2,206 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో అవసరమయ్యే సిబ్బంది కంటే 20 శాతం అదనంగా మ్యాన్‌పవర్‌ను గుర్తించి శిక్షణ ఇచ్చాం. మొత్తం 5,300 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారు. సువిధ, ఎన్‌కోర్, సీ–విజిల్‌లాగా 12 ఐటీ అప్లికేషన్లు ఉన్నాయి. వీటన్నింటిపై శిక్షణ ఇచ్చాం. ఇక ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తాం. ఈవీఎం మిషన్, వీవీప్యాడ్ అంటే ఏమిటి? ఎలా కనెక్ట్ చేయాలి. 17ఏతో పాటు అన్ని రకాల నిబంధనలు, అంశాలపై, చివరకు మిషన్లపై పూర్తి శిక్షణ ఇస్తాం. ఇది చాలా ముఖ్యమైంది. వీటిపై అధికారులకు అవగాహన ఉంటనే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతుంది. అందుకే శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. 'జీరో వయెలెన్స్.. నో రీపోల్' అనే నినాదాన్ని తీసుకున్నాం. ప్రొసీజర్ వల్ల రీపోలింగ్ జరగకూడదు. గొడవలు లేకుండా నివారించాలి. తప్పని పరిస్థితుల్లో రీపోలింగ్‌కు వెళతాం. ఈ పరిస్థితి రాకుండా ఎన్నికలు చేయడమే లక్ష్యం.



సాక్షి: అర్బన్ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉంటోంది. దీన్ని అధిగమించలేరా?

కలెక్టర్: నిజమే. గత ఎన్నికల్లో జిల్లాలో 76శాతం పోలింగ్ జరిగింది. కానీ కర్నూలులో 58, ఆదోనిలో 62శాతమే ఉంది. దీంతో జిల్లా శాతం కూడా తగ్గింది. అర్బన్ ఏరియాల్లో గత ఎన్నికల్లో ఏ పోలింగ్‌బూత్ పరిధిలో పోలింగ్‌శాతం తగ్గిందో గుర్తించి అధికారులను పంపి అక్కడ ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, ఇతర సంఘాలతో చర్చించి చైతన్యం చేస్తున్నాం. అర్బన్‌లో కచ్చితంగా పోలింగ్ పెంచాలి. జిల్లా సగటు 85శాతం తగ్గకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాం.

సాక్షి: ఎన్నికల్లో ఫిర్యాదులు ఉంటే ఎలా చేయాలి? స్పందన ఉంటుందా?

కలెక్టర్: కచ్చితంగా. ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు. కేంద్ర ఎన్నికల కమిషన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1950, జిల్లా పరిధిలో 18004257755 ల్యాండ్‌లైన్ 08518–220125కు ఫోన్ చేయొచ్చు. వీటన్నింటి కంటే సీ–విజిల్(సిటిజన్ విజిలెంట్) ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు వస్తే 100 నిమిషాలు అంటే 2 గంటల లోపే బృందాలు వెళ్లి, పరిశీలించి నివేదిక ఇస్తాయి. ఇప్పటి వరకు 157 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 73శాతం పరిష్కరించాం. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నామినేషన్లు మొదలైతే వీటి సంఖ్య వేలల్లోకి చేరుతుంది. వాటికి అనువుగా సిబ్బందిని నియమించాం. పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల నియమావళి ప్రకారమే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నడుచుకోవాలి. లేకపోతే చర్యలు తప్పవు.



సాక్షి: అభ్యర్థుల ఖర్చు ఎన్నికల కమిషన్ చెప్పే దానికి, నిజానికి భారీగా వ్యత్యాసం ఉంది? వీటిని నివారించగలరా?

కలెక్టర్: ఎమ్మెల్యే అభ్యర్థులు రూ.40లక్షలు, ఎంపీ అభ్యర్థులు రూ.95లక్షలు ఖర్చు చేయాలి. డీపీసీ(డిస్ట్రిక్ ప్రొక్యూర్‌మెంట్ కమిటీ) చైర్మన్‌గా జేసీ ఉంటారు. కుర్చీలు, జెండాలు, కరపత్రాలు నుంచి అన్నింటి ఖర్చులపై అధికారులకు శిక్షణ ఇచ్చాం. ధరలు సేకరించాం. నామినేషన్ తర్వాత అయ్యే ఖర్చులను లెక్కగడతాం. అభ్యర్థుల ప్రచారాల్లో కూడా మా అధికారుల విజిలెన్స్ ఉంటుంది. దీనిపై రాజకీయ పార్టీలకు కూడా అవగాహన కల్పించాం. ప్రతీ వారం రాజకీయ పార్టీలతో మీటింగ్‌లు నిర్వహించాలనుకున్నాం. ఖర్చు పెరిగితే చర్యలు తీసుకుంటాం. అలాగే పోలింగ్ స్టేషన్‌లో గత ఎన్నికల్లో 75శాతం సీసీ కెమెరాలు అమర్చారు. ఇప్పుడు వందశాతం కావాలని ప్రతిపాదించాం. లైసెన్స్‌డ్ గన్‌లు కోడ్ కాలంలో తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారా? ఎన్ని ఉన్నాయి? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్: డీఎస్పీ, ఆర్‌ఓలు పంపిన వాటిని ఎస్పీతో కలిసి పరిశీలిస్తున్నాం. పోలింగ్ సెంటర్లో పంచాయతీ, సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గతంలో ఏవైనా గొడవలు జరిగాయా? 90శాతంపైగా పోలింగ్ జరిగి అందులో 75శాతం ఓట్లు ఒకే అభ్యర్థికి వచ్చాయా? అనే అంశాలను సూక్ష్మంగా పరిశీస్తున్నాం. నిజంగా సమస్యాత్మక గ్రామాలా? లేదంటే కావాలనే చెబుతున్నారా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఒక్కోసారి ఫోర్స్ ఎక్కువ ఉంటే ప్రజలు ఓటింగ్‌కు వచ్చేందుకు భయపడే అవకాశం ఉంది. పోలీసులు ధైర్యం ఇవ్వడానికి ఉండాలా? భయపెట్టేందుకా? అనే అంశాన్ని ఆలోచించి ఓటర్ల హక్కులకు, స్వేచ్ఛకు భంగం కలగకుండా భరోసా ఇచ్చేలా చూస్తాం. ఆ దిశగానే చర్యలు తీసుకుంటున్నాం.

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక నిఘా

- ప్రశాంత ఎన్నికలకు ప్రణాళికలు రూపొందించుకోండి
- ఉల్లంఘనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి
- రేంజ్ పరిధి ఎస్పీలకు డీఐజీ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా పెంచాలని డీఐజీ సీహెచ్ విజయరావు కర్నూలు రేంజ్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే కేంద్ర సాయుధ బలగాలతో కవాతు, పోలీసు పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రేవ్ క్రైంపై ప్రత్యేక దృష్టి సారించి నేర ప్రవృత్తి గల వారిని బైండోవర్ చేయాలన్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి శనివారం కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో డీఐజీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి బాధ్యతగా పని చేయాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు వాస్తవాలను మీడియాకు వెల్లడించాలని, బందోబస్తు విధులకు కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సీసీ కెమెరాలతో పకడ్బందీ నిఘా ఉంచాలన్నారు.

ఉల్లంఘనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పైఅధికారులకు సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బలగాలతో రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్ చేయించాలన్నారు. లైసెన్స్ ఆయుధాలన్నింటినీ డిపాజిట్ చేయించాలని, ఇంటిగ్రేటెడ్, బార్డర్ చెక్‌పోస్టుల్లో పోలీసులు, సెబ్, ఫారెస్ట్, ఆర్‌టీఏ అధికారులు సమన్వయంతో పనిచేసే విధంగా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేయాలన్నారు. ఏమైనా పట్టుబడితే సంబంధిత ఇన్‌కమ్ ట్యాక్ అధికారులకు, లేదా ఇతర అధికారులకు సమాచారం అందించాలన్నారు. సీ విజిల్ యాప్‌లో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పేకాటపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి, సిద్ధార్థ కౌశల్, కృష్ణారావుతో పాటు ఆయా జిల్లాల అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

శిలాఫలకాలపై ఎలాంటి చర్యలు వద్దు

కర్నూలు(అర్బన్): భారత ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల ప్రకారం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై ఎలాంటి చర్యలు తీసుకోనవసరం లేదని జెడ్పీ సీఈఓ, ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి జి. నాసరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై ప్రజాప్రతినిధుల ఫొటోలు, పేర్లు, చేపట్టిన పని విలువ, అంచనాల గురించిన వివరాలు ఉన్నాయన్నారు. అయితే, ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఈ శిలాఫలకాలపై ఎంసీసీ బృందాలు ఎలాంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

బీటీ-2 పత్తి విత్తన ధరలు ఖరారు

కర్నూలు(అగ్రికల్చర్): బీటీ పత్తి విత్తన ప్యాకెట్ల ధరలను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. బీటీ–1 విత్తనాల ధరలు కొన్నేళ్లుగా నిలకడగా ఉండగా.. బీటీ–2 పత్తి విత్తనాల ధరలను పెంచుతోంది. విత్తనాలను 450 గ్రాముల ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఇందులో 25 గ్రాములు నాన్ బీటీ పత్తి విత్తనాలు ఉంటాయి. 450 గ్రాముల బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్ ధర 2023–24లో రూ.853 ఉండగా.. 2024–25 సంవత్సరానికి ప్యాకెట్ ధరను రూ.864లకు పెంచినట్లు స్పష్టమవుతోంది. అంటే 450 గ్రాముల ప్యాకెట్‌పై రూ.11లు పెరిగింది. బీటీ–1 పత్తి విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర నిలకడగా రూ.635 ఉంది.



నెత్తిపై నిప్పుల కుంపటి

ఉదయం 8 గంటల నుంచే ఎండల తీవ్రత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. 40 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రత నమోదవుతుండటంతో ఉక్కపోత అధికమైంది. ఇంటి నుంచి కాలు బయటపెట్టేందుకు ఆలోచించాల్సిన పరిస్థితి. అత్యవసరమై బయటకు వచ్చినా చెమటలు కక్కాల్సిందే. ఈ నేపథ్యంలో ఓ బాలింత వైద్య పరీక్షల నిమిత్తం కర్నూలు పెద్దాసుపత్రికి వచ్చింది. అయితే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో తాను తలపై వేసుకున్న తువాలునే చిన్నారికి అడ్డుగా పెట్టి రోడ్డు దాటింది. ఈ దృశ్యం చూస్తే వేసవి ఏ స్థాయిలో ప్రభావం చూపుతుందో అర్థమవుతోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేద్దాం

- మహిళలకు ఒక్క మంచి చేయని చంద్రబాబును నమ్మొద్దు
- ఏపీలో మహిళల కోసం అమలు చేసే పథకాలు దేశానికే ఆదర్శం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత



జగనన్నను గెలిపించుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ విజయ సంకేతం చూపిస్తున్న మహిళా నేతలు, ఎమ్మెల్యేలు

కర్నూలు (టౌన్): ఎన్నికల్లో మహిళలంతా ఏకమై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత పిలుపునిచ్చారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం కర్నూలు, నంద్యాల జిల్లాల మహిళా విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. పద్నాలుగేళ్లు సీఎంగా చేశానని చెప్పుకుంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు మహిళలకు ఒక్క మంచి కూడా చేయలేదన్నారు. పచ్చ మీడియాను అడ్డుపెట్టుకొని అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీపై నిత్యం బురదజల్లే కార్యక్రమం చేపడుతున్నారన్నారు. మహిళలకు ఇళ్లు ఇస్తే కోర్టులో కేసులు వేసి చంద్రబాబు అడ్డు తగిలారన్నారు. జగనన్న పేదల పక్షపాతి అయితే చంద్రబాబు పేద ప్రజల ద్రోహి అన్నారు. ఐదేళ్ల పాలనలో వివిధ పథకాల కింద రూ.2.65 లక్షల కోట్లు ప్రజలకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏపీలో మహిళల కోసం అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

- పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్లలో 140 సార్లు బటన్ నొక్కి ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి మహిళా రెండు సార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.
- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రజలకు అండగా ఉన్నామన్న అక్కసుతో తన కుటుంబానికి చంద్రబాబు నాయుడు కోలుకోలేని నష్టం చేశారన్నారు. జగనన్న తనకు అండగా నిలిచి రెండోసారి సైతం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించారన్నారు.
- కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ.. మంచి పాలన అందిస్తున్న జగనన్నను మనందరం గెలిపించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో జగనన్న మహిళలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు.
- పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శశికళా రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ,
- పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు ఆర్థికంగా రాజకీయంగా, సామాజికంగా న్యాయం జరిగిందన్నారు. మహిళల కోసం చంద్రబాబు ఏం చేశారో చెప్పాలన్నారు.

జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ శిరోమణి మద్దయ్య, పార్టీ మహిళా విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ గాజుల శ్వేతారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక మాట్లాడుతూ.. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి మహిళకు లబ్ధి చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. సమావేశంలో కర్నూలు నంద్యాలకు చెందిన మహిళా విభాగం నాయకురాలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి

కర్నూలు (సెంట్రల్): రాజకీయ పార్టీలు ప్రచారాలకు తప్పకుండా ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. శనివారం ఉదయం కలెక్టర్ ఎన్నికల అంశాలపై ఆర్ఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రాజకీయ పార్టీల అనుమతులు తీసుకొని ప్రచారం చేస్తుంటే ఆ వివరాలను ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు పంపాలని ఆర్ఓలను ఆదేశించారు. సీవిజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలన్నారు. ఈ యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలను కూడా సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి 30 రోజులు దాటిన దరఖాస్తులు 151 పెండింగ్‌లో ఉన్నాయని, అందులో కర్నూలులోనే 111, పత్తికొండలో 23 ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 26వ తేదీలోపు పెండింగ్‌లో ఉన్న ఫారం 7,8 లను పరిష్కరించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో పాణ్యం, కర్నూలు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఆర్ఓలు వరుసగా నారపురెడ్డి మౌర్య, భార్గవ్‌తేజ, శివ్‌నారాయణ్ శర్మ, ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, మురళి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

పాణ్యం అభ్యర్థులు కర్నూలులో నామినేషన్ వేయాలి

- స్పష్టం చేసిన ఈఆర్ఓ, జేసీ మౌర్య

పాణ్యం: పాణ్యం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే అభ్యర్థులు కర్నూలులోనే నామినేషన్ వేయాల్సి ఉంటుందని పాణ్యం నియోజకవర్గ ఈఆర్ఓ, కర్నూల్ జేసి నారపురెడ్డి మౌర్య అన్నారు. శనివారం పాణ్యం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండలంలో అత్యధిక ఓటర్లు ఉన్నారని, దీనికి తోడు ఈఆర్ఓ ఎక్కడుంటే అక్కడే నామినేషన్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి తప్పకుండా అనుమతి తీసుకోవాలన్నారు. మే 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. ఎక్కడైనా మద్యం, నగదు, ఇతర విలువైన వస్తువుల పంపిణీ జరుగుతుంటే తక్షణమే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. నియోజకవర్గంలో 64 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని పేర్కొన్నారు. ఇందులో రెండు కల్లూరు, 17 ఓర్వకల్లు, 4 పాణ్యం, 11 గడివేముల మండలాల్లో ఉన్నాయని చెప్పారు. 85 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, అలాంటి వారు ఎవరైనా ఉంటే ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కల్యాణ వైభోగమే..

- నయనానందకరం.. శ్రీ ప్రహ్లాదవరదుడి కల్యాణం
- పరవశించిన భక్తజనం



ఎదుర్కోల్లు నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: సకల కల్యాణ గుణ పరిపూర్ణుడైన దేవదేవుడు వరదహస్తుడై ఆశీర్వదించిన వేళ.. స్వామివారి కరుణాకటాక్ష వీక్షణాలకై భక్తజనం పోటెత్తిన సమయాన.. వేద మంత్రోచ్ఛారణల నడుమ దిక్కులు పిక్కటిల్లేలా 'ఉగ్రం వీరం మహావిష్ణుం.. ఓం నమో నారసింహాయ' అంటూ నామస్మరణలు మిన్నంటిన శుభ సమాయాన.. విద్వాంసుల సొంపైన మంగళ వాయిద్యాలతో జరిగిన జగత్కల్యాణం అందర్నీ ఆనందపారవశ్యంతో ముంచెత్తింది. ఆ అపూర్వ ఘట్టం భక్తకోటి హృదాయాల్లో ఆధ్యాత్మిక వైభవాన్ని నింపింది.. నల్లమల పులకించింది.. శ్రీ లక్ష్మీనరసింహస్వాముల తిరుకల్యాణ మహా ఘట్టాన్ని చూసిన భక్తుల హృదయం పరవశించింది.

కనుల పండువగా..

అహోబిల పుణ్యక్షేత్రంలో శనివారం లక్ష్మీనరసింహ స్వామి వారి మహాద్భుత పరిణయోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా వేద పండితులు పుణ్యాహవచనం చేసి నవగ్రహ మంటపారాధన అనంతరం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సమర్పించిన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను పెండ్లి కూతురు, పెండ్లి కుమారులుగా అలంకరించారు. ఇరువురిని విడివిడిగా పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా పెండ్లి మంటపానికి తోడ్కొని వచ్చి పెళ్లి పీటలపై కొలువుంచారు. ఎదుర్కోల్లు నిర్వహించిన అనంతరం వైష్ణవ ఆచారంగా వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో కల్యాణాన్ని జరిపించారు. యజ్ఞధారణ, జీలకర్ర బెల్లం తతంగాలు చేపట్టాక మాంగళ్య ధారణ నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం పూర్తి చేశారు. స్వామి, అమ్మవారి మీద నుంచి కింద పడ్డ తలంబ్రాలను భక్తులకు పంచి పెట్టారు.

కమనీయం..కాళింగనర్థనోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో శనివారం కాళింగనర్థనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం జరిపారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవారికి అభిషేకం, తొట్టి తిరుమజనం నిర్వహించారు. దిగువ అహోబిలంలో రాత్రి ప్రహ్లాదవరదస్వామి గజవాహనంపై కొలువై మాడవీధుల్లో సంచరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రత్యేక వాహనంలో తిరుమల వెంకటేశ్వరుని సన్నిధి నుంచి తీసుకు వచ్చిన పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పీఠాధిపతి, అర్చకులు



కాళింగనర్థనోత్సవంలో స్వామివారు



పట్టు వస్త్రాలు అందజేస్తున్న టీటీడీ అధికారులు

'ఉపాధి' పనులకు పెరుగుతున్న డిమాండ్



అమరనాథరెడ్డి, డ్వామా పీడీ

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు డిమాండ్ పెరుగుతోందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిమాండ్‌కు అనుగుణంగా పనులను గుర్తించి సిద్ధంగా ఉంచుకున్నామని పేర్కొన్నారు. 2022-24 ఆర్థిక సంవత్సరంలో 92 లక్షల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యమని, ఇప్పటికే 98 లక్షల పని దినాలు కల్పించామని పేర్కొన్నారు. వచ్చే సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్ ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున ఉపాధి పనులకు తెల్లవారుజామునే వెళ్లి ఎండల తీవ్రత పెరగక ముందే ఇంటికి చేరే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 6 గంటలకే పనులకు హాజరై 11 గంటలకు ఇళ్లు చేరడం మంచిదని తెలిపారు. ఉపాధి కూలీలు ఈ విధంగా పనులకు హాజరయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. గత ఏడాది వేసవి సమయంలో పని ప్రదేశంలో నీడ కోసం షేడ్స్ సరఫరా చేశామని, వీటిని ఉపయోగించాలని సూచించారు. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురి కాకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని వివరించారు.

నిర్భయంగా ఓటేయండి

- జేసీ నారపురెడ్డి మౌర్య



మద్దూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మాట్లాడుతున్న జేసీ మౌర్య

పాణ్యం: ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కర్నూలు జిల్లా జేసీ, పాణ్యం ఈఆర్ఓ నారపురెడ్డి మౌర్య అన్నారు. శనివారం పాణ్యం మండలంలో ఆమె పర్యటించారు. మద్దూరు గ్రామంలో ఓటు హక్కు వినియోగం, ఓటు విలువపై ప్రజలకు అమె అవగాహన కల్పించారు. అంతకు ముందు గ్రామంలో ఎన్నికల సిబ్బంది, పొదుపు మహిళలు, సీసీలు, విద్యార్థులతో కలిసిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటను మద్యం, నగదు, ఇతర బహుమతులకు అమ్ముకోవద్దని సూచించారు. ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులకు గాని, సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మద్దూరు, అనుపూరు, కొత్తూరు, గోనవరం, అలమూరు, కొణిదేడు, పాణ్యంలో పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. కొత్తూరు గ్రామంలో శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వరస్వామికి పూజలు చేశారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఎంఈఓలు సుబ్రమణ్యం, కోటయ్య, ఎస్ఐ ఆశోక్, ఏపీఎం ప్రసాద్, మద్దూరు సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, డీటీ రమాదేవి, ఆర్ఐ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కేజే రెడ్డి

కర్నూలు సిటీ: నగర శివారులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ స్కూల్ చైర్మన్ కేజే రెడ్డి ముఖ్యఅతిథిగా జ్యోతి ప్రజ్వలనగావించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ లక్ష్య సాధన దిశగా చదువులో రాణించాలన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఎందులో ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారో గుర్తించి ఆ వైపుగా వారిని ప్రోత్సహించాలన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆర్ఎస్ రెడ్డి, ప్రిన్సిపాల్ జస్మిత్ కౌర్ షేఖాన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు సిటీ: జిల్లాలోని 16 ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కాగిత శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ/బైపీసీ/ఎంఈసీ/సీఈసీ గ్రూప్‌లలో ఉచిత విద్యకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 నుంచి మే నెల 22వ తేది వరకు https://apms.apcfss.in, https://cse.ap.gov.in నందు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.200, ఎస్సీ, ఎస్టీలకు రూ.150 రుసుము ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఏపీ మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, ఎంఈఓ, డీఈఓ ఆఫీసులలోని అధికారులను అడిగి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

కట్టుదిట్టంగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు

- విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. శామ్యూల్‌పాల్

కృష్ణగిరి: ఓపెన్ ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య జరుగుతున్నాయని, ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్య లు తీసుకున్నామని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. శామ్యూల్‌పాల్ తెలిపారు. శనివారం ఆయన కృష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాన్ని 173 మంది విద్యార్థులను కేటాయించగా 13 మంది గైర్హాజరయ్యారన్నారు. కాపీయింగ్ జరగకుండా పరీక్ష ప్రారంభం అయిన రోజే జిల్లా విద్యాశాఖ అధికారి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు.

టైర్ పంక్చరై ఢీకొన్న వాహనాలు

- ఒకరికి గాయాలు



బొలెరోను ఢీకొన్న ఐచర్

వెల్దుర్తి(కృష్ణగిరి): టైర్ పంక్చర్ కావడంతో వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. వెల్దుర్తి మండల పరిధిలోని మదార్‌పురం ఫ్లైఓవర్ వద్ద ఎన్‌హెచ్ 44పై ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. డోన్ మీదుగా కర్నూలు వైపు వెళ్తున్న హర్యానాకు చెందిన బొలెరో టైర్ పంక్చర్ కావడంతో వేగం తగ్గింది. దీంతో ఆవాహనం వెనుక అతివేగంగా వస్తున్న ఐచర్ ఢీకొంది. అదే సందర్భంలో వెనుక వస్తున్న కారు ఐచర్‌ను ఢీకొంది. ఐచర్‌లోని కర్నూలు ముజఫర్ నగర్‌కు చెందిన శివ చేతికి గాయాలయ్యాయి. మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. సంఘటనాస్థలికి చేరుకున్న హైవే పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ప్రొద్దుటూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

- లాడ్జిలోని గదిలో బ్లేడ్‌తో చేతి నరాలు కోసుకున్న రాజశేఖర్‌శర్మ
- గోనెగండ్ల మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు
- తన తప్పు లేకున్నా అన్యాయంగా సస్పెండ్ చేశారని సూసైడ్ నోట్



రాజశేఖర్‌శర్మ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం: కర్నూలు జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న నొస్సం రాజశేఖర్‌శర్మ(49) ప్రొద్దుటూరులోని ఓ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడ మండలం, నొస్సం గ్రామానికి చెందిన రాజశేఖర్‌శర్మ కొన్నేళ్ల క్రితం ఉద్యోగ రీత్యా కర్నూలులో స్థిరపడ్డాడు. నగర శివారులోని స్కందలోటస్ విల్లాస్‌లో వారి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన గోనెగండ్ల మండలంలోని పుట్టపాశం గ్రామంలో ఉన్న ఎంపీయూపీ స్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్నాడు. భార్య రమాదేవితో పాటు కుమారుడు రిషికుమార్ ఉన్నాడు. కుమారుడు మూడో సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు.

ఈ నెల 21న రాజశేఖర్‌శర్మ ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లాడు. కొంత సేపటి తర్వాత ఆయనను సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో ఉత్తర్వులు తీసుకోకుండానే పాఠశాల నుంచి వచ్చేశాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన రాజశేఖర్‌శర్మ 'మా సార్ పిలుస్తున్నాడు.. బస్టాండు వరకు వెళ్లొస్తానని' చెప్పి వెళ్లాడు. అయితే రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నగరమంతా గాలించారు. 24 గంటలు గడిచినా ఇంటికి రాకపోవడంతో కర్నూలులోని 4వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ప్రొద్దుటూరు లాడ్జిలో ఆత్మహత్య

రాజశేఖర్‌శర్మ 21న కర్నూలు నుంచి నేరుగా ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఒక లాడ్జికి వెళ్లి రాత్రి అక్కడే పడుకున్నాడు. మూడు రోజులుగా అతను లాడ్జిలోనే ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం అతను చేతులకు రక్తం కార్చుకుంటూ లాడ్జి గదిలో నుంచి బయటికి వచ్చాడు. రక్తంతో ఉన్న అతన్ని చూసి లాడ్జి నిర్వాహకులు వెంటనే ఫోన్ చేయడంతో 108 అంబులెన్స్ వచ్చింది. అయితే అంబులెన్స్ సిబ్బంది వచ్చి చూసేలోపే రాజశేఖర్‌శర్మ చనిపోయాడు. విషయం తెలుసుకున్న టూ టౌన్ సీఐ అబ్దుల్‌కరీం ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రెండు చేతుల నరాలను కోసుకోవడం వల్ల తీవ్ర రక్తస్రావమై అతను చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు రాసుకున్న సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నన్ను అన్యాయంగా సస్పెండ్ చేశారు..

'నా పై అధికారులు నాతో మాట్లాడలేదు.. ఏం జరిగిందో నన్ను అడగకుండానే ఉపాధ్యాయుల మాట విని నన్ను సస్పెండ్ చేశారు. నేను ఏ తప్పు చేయలేదు. విద్యార్థులతో చనువుగా ఉండటం తప్పా! చివరకు చిన్న పిల్లల చేత ఉపాధ్యాయులు నాపై తప్పుడు ఫిర్యాదు ఇప్పించారు. ఇది చాలా అన్యాయం సార్. నేను ఏ తప్పు చేయలేదు..' అని రాజశేఖర్‌శర్మ సూసైడ్ నోట్‌లో రాసుకున్నారు.

ఏపీ సీడ్స్‌లో విత్తనోత్పత్తి రైతుల ధర్నా

- బకాయిలు చెల్లించాలని డిమాండ్

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీసీడ్స్)కు సరఫరా చేసిన శనగ విత్తనాలకు పెండింగ్‌లో ఉన్న మొత్తం వెంటనే చెల్లించాలని కోరుతూ రైతులు ధర్నా చేశారు. 2022-23లో ఉమ్మడి జిల్లాలోని ఓర్వకల్లు, కల్లూరు, నందికొట్కూరు, కోడుమూరు తదితర మండలాలకు చెందిన 170 మంది రైతులు శనగ విత్తనోత్పత్తి చేసి ఏపీ సీడ్స్‌కు 10 వేల క్వింటాళ్లు సరఫరా చేశారు. అడ్వాన్స్ కింద రైతులకు ఏపీ సీడ్స్ రూ.4,400 ప్రకారం చెల్లించింది. పెండింగ్‌లో ఉన్న మొత్తం చెల్లించాలని కోరుతూ శనివారం కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేటు లోని ఏపీ సీడ్స్ కార్యాలయంలో దాదాపు 100 మంది రైతులు ధర్నా చేశారు. విత్తనోత్పత్తి చేసిన శనగ విత్తనాలను ప్రాసెసింగ్ చేసి ఇచ్చామని, ఆర్గనైజర్లకు చెల్లించిన ధరనే తమకు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. క్వింటాకు ఇంకా రూ.2,500 వరకు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ఏపీ సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. ధర్నాలో రైతు నాయకులు శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.